7

సాక్షి అనకాపల్లి

సోమవారం । 23 । సెప్టెంబర్ । 2024



శరన్నవరాత్రులకు సిద్ధం

మాడుగులలో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 8లో



ఎస్సీ వర్గీకరణ చేయొద్దు

8లో

కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేశామని, తీర్పు వచ్చే వరకూ ఎస్సీ వర్గీకరణ చేయవద్దని అంబేడ్కర్ గ్లోబల్ మిషన్ అధ్యక్షుడు తెలిపారు.



మానవ హక్కుల కౌన్సిల్‌తో రక్షణ

మానవ హక్కుల కౌన్సిల్ ప్రజల రక్షణకు కవచంగా నిలుస్తోందని కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి శ్యాంప్రసాద్ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

ప్రేక్షకులకు నచ్చే విధంగా 'రివైండ్'



రివైండ్ చిత్ర దర్శకుడు కల్యాణ్‌చక్రవర్తికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న సురేంద్ర

అనకాపల్లి: రివైండ్ చిత్రం ప్రేక్షకులకు నచ్చే విధంగా ఉంటుందని, అక్టోబర్ 18న తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా విడుదలవుతుందని చిత్రం దర్శకుడు, అనకాపల్లికి చెందిన పెంటకోట కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. స్థానిక గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారిని ఆయన ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రివైండ్ చిత్రాన్ని క్రాస్ వైర్ క్రియేషన్స్ బేనర్ పై నిర్మించినట్టు చెప్పారు. హీరోగా సాయి రోనాక్, హీరోయిన్‌గా అమృతచౌదరి, ప్రధాన పాత్రల్లో సురేష్, సామ్రాట్ రెడ్డి, జబర్దస్త్, ఫన్ బకెట్ కామెడీ నటులు నటించగా, సంగీతం ఆశీర్వాద్ సమకూర్చినట్టు ఆయన తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో పాటు ప్రజలందరి ఆశీస్సులు ఉండాలని ఆయన కోరారు. అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని కల్యాణ్ చక్రవర్తికి నూకాంబిక అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ మళ్ల సురేంద్ర అందజేశారు.

విశాఖ డెయిరీ నెయ్యి కొనుగోలుకు చర్యలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో లడ్డూల తయారీ, దీపారాధన, ఇతర అవసరాలకు విశాఖ డెయిరీ నెయ్యి కొనుగోలుకు దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. దేవస్థానంలోని సెంట్రల్ స్టోర్స్‌లో శనివారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేసి, అప్పటికి స్టాక్ ఉన్న నెయ్యిని సీజ్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఆదివారం లడ్డూల తయారీని నిలిపివేశారు. ఆదివారం నాటికి 71 వేల లడ్డూల స్టాక్ ఉండటంతో వాటిని విక్రయిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 25 వేల నుంచి 30 వేల లడ్డూలు అవసరం ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా విశాఖ డెయిరీ నెయ్యిని కొనుగోలు చేసేందుకు దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేయడంతో, దేవస్థానం అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. సోమవారం 15 కిలోల చొప్పున వంద టిన్ల విశాఖ డెయిరీ నెయ్యి దేవస్థానానికి రానుంది. దీంతో సోమవారం నుంచి తిరిగి లడ్డూలను తయారు చేయనున్నారు.

ఎక్కువ మెజార్టీ వచ్చిన గ్రామాలకే అధిక నిధులు



మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నాతవరం: మాపార్టీ నాయకులు ఏమనుకున్నా సరే నాకు ఎక్కువ మెజార్టీ ఓట్లు వచ్చిన పంచాయతీలకే అధికంగా నిధులు ఇస్తానని స్పీకరు సీహెచ్. అయ్యన్నపాత్రుడు తెలిపారు. మండలంలోని చెర్లోపాలెంలో ఆదివారం నిర్వహించిన 'మన మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీగౌరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సామూహిక సీమంతాలు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం జరిగిన సభలో అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ చెర్లోపాలెం పంచాయతీలో డ్రైనేజీలు నిర్మాణానికి రూ.6.18 కోట్లు, సిమ్మెంటు రోడ్డుకు రూ 10లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. గ్రామ పంచాయతీకి రూ.6.95 లక్షలను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. ఈకార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో జయరాం, మండల ప్రత్యేకాధికారి జి.వి.లక్ష్మి, తహసీల్దార్ ఎస్.ఎస్.వి.నాయుడు, ఎంపీడీవో హనుమంతరావు పాల్గొన్నారు.

పరారైన తహసీల్దార్ హత్య కేసు నిందితుడి అరెస్ట్

మధురవాడ(విశాఖ): బెయిల్ రద్దయిన తరువాత విశాఖ నగరం నుంచి పరారైన తహసీల్దార్ సనపల రమణయ్య హత్య కేసు నిందితుడు మురారి సుబ్రహ్మణ్యం గంగారావు పోలీసులకు చిక్కాడు. అతడిని విజయవాడలో పీఎంపాలెం పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న గంగారావు బెయిల్ రద్దయిన తర్వాత ఎటువంటి సమాచారం లేకుండా నగరాన్ని వదిలి వెళ్లిపోయాడు. దీంతో అతడిపై కోర్టు నాన్ బెయిల్ వారెంట్ ఇచ్చింది. పీఎంపాలెం పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి విజయవాడలో అతడిని అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం కోర్టులో హాజరు పరిచినట్టు సీఐ గేదెల బాలకృష్ణ చెప్పారు.

ఏం కొనలేం ఏం తినలేం...

- సామాన్యుడికి ధరాఘాతం
- అమాంతం పెరిగిన కూరగాయల ధరలు
- ఆకాశాన్నంటుతున్న నిత్యావసర సరుకులు
- పట్టించుకోని అధికారులు

కంచంలో కూర కనుమరుగువుతోంది... పప్పన్నం అటుంచి పచ్చడి మెతుకులు కూడా కరవవుతున్నాయి. కనీసం నీళ్ల చారుతోనైనా కడుపు నింపుకుందా మనుకున్నా సాధ్యపడని పరిస్థితులు దాపురించాయి. నాలుగువేళ్లు నోటిలోకి వెళ్లడం లేదు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటడంతో సామాన్యులు అర్ధాకలితో బతుకులు వెళ్లదీయ వలసిన దౌర్భాగ్యం ఏర్పడింది.కంది పప్పు కొండెక్కి కూర్చొంది. కూరగాయల ధరలూ మండిపోతున్నాయి. వంట నూనెల ధరలు సలసలా కాగుతున్నాయి. ఆదాయం కంటే ఖర్చులు అధికమవడం, గతంలో ఎన్నడూ లేనివిధంగా నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు విలవిల్లాడుతున్నారు.

నక్కపల్లి: నిత్యావసర వస్తువులు, కూరగాయాల ధరలు ఆకాశాని అంటండంతో మార్కెట్‌కు వెళ్లాలంటేనే సామాన్య, మధ్య తరగతి ప్రజలు భయపడుతున్నారు. గత నాలుగు రోజులుగా కూరగాయల ధరలు పెరుగుతూ వస్తున్నాయి. కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తూ రేట్లను మరింత పెంచేస్తున్నారు. ధరలు తగ్గుతాయి, ఇంటిల్లపాది కడుపారా భోజనం చేద్దామన్న సామాన్యుడి ఆశలు అడియాసలవుతున్నాయి. జిల్లాలోని జరిగే వారపు సంతల్లో కూడా అధిక రేట్లకు కూరగాయలు, నిత్యావసర సరకులు విక్రయిస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా చిక్కుడుకాయల ధర కిలో రూ.200 పలుకుతోంది. టమాటా కిలో రూ.40, వంకాయలు కిలో రూ.60, ఆగాకర కిలో రూ.160, ఉల్లిపాయలు కిలో రూ.60,పచ్చి మిర్చి కిలో రూ.80, కేరట్ కిలో రూ.60 బీరకాయలు కిలో రూ.80కు విక్రయిస్తున్నారు.బెండకాయలుకూడా కిలో రూ.60, మామిడి కాయలు(పునాస) ఒక్కొక్కటి రూ.30లకు విక్రయిస్తున్నారు. ఆకుకూరలయితే వేరే చెప్పక్కర్లేదు. కొత్తిమీర కట్ట రూ.80లు, తోటకూర, పాల కూర కట్ట రూ.50లకు అమ్ముతున్నారు. బీట్‌రూట్, క్యాబేజీ, మునగ తదితర కూరగాయలు కూడా కొద్ది శాతం ధరలు పెరిగాయి. 3 మునగ కాయల రూ.20లకు విక్రయిస్తున్నారు. ముగ్గురు సభ్యులున్న కుటుంబానికి పూటకు అరకిలో కూరగాయలు అవసరమవుతున్నాయి. దీంతో చాలా మంది అరకొరగా కూరగాయలు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. గణపతి నవరాత్రుల సందర్భంగా ప్రతి గ్రామంలోను మండలపాల వద్ద అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో కూరగాయాలకు డిమాండ్ పెరగడంతో వ్యాపారులు ధరలను అమాంతం పెంచేశారు. దీంతోసామాన్య, మధ్యతరగతి ప్రజ ల పరిస్థితి ఏం కొనలేం, తినలేం అన్నట్టు ఉంది.

నిత్యావసరసరుకులదీ అదే పరిస్థితి...

నిత్యావసర సరకుల ధరలు కూడా అమాంతం పెరిగిపోయాయి. కందిపప్పు ధర కిలో రూ.160 పలుకుతోంది. చింతపండు ధర రూ.180 కు పెరిగింది. నూనెల ధరలైతే సలసలా కాగుతున్నాయి. రూ.160 నుంచి రూ.220 వరకు విక్రయిస్తున్నారు.పంచదార ధర కిలో రూ.48నుంచి రూ.60ల వరకు ఉంటోంది. మినపప్పు, నువ్వుల పప్పు, పెసరపప్పు ధరలు రూ.140, రూ.300, రూ.140కు పెరిగాయి. గతంలో రేషన్‌డిపోల ద్వారా కందిపప్పు,పంచదారను తక్కువధరకు సరఫరా చేసే వారు ఇప్పుడు సరఫరా చేయకపోవడంతో అధిక ధరలు పెట్టి మార్కెట్లోకొనుగోలు చేయాల్సి వస్తోంది.



సరకుల ధరలు (కిలో రూ.లలో)

	ఆగస్టు	సెప్టెంబర్
పామాయిల్	110	122
రిఫండాయిల్	162	185
చింతపండు	140	160
బెల్లం	52	60
మినపప్పు	160	185
కంది పప్పు	140	160
పెసర పప్పు	80	110



అదుపుచేయని ప్రభుత్వం

ధరలు మండిపోతున్నా... నియంత్రణకు ప్రభుత్వం కనీస స్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. ధరలను నియంత్రించాల్సిన మార్కెటింగ్, పౌరసరఫరాల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నట్టు మిన్నకున్నారని వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అమ్మో బియ్యం

బియ్యం ధరలు కూడా అమాంతం పెరిగిపోయాయి. సోనా, సాంబ మసూరి రకాలు గతంలో 25కిలోల బస్తా రూ.1250లకు విక్రయిస్తే ప్రస్తుతం రూ.1650లకు పెంచేశారు. ఇక ఆర్‌బీఎల్, స్వర్ణ తదితర రకాలయితే 25కిలోల బస్తా రూ.1300 పెట్టి కొనాల్సి వస్తోంది. సామాన్యులకు కూలిపనులు కూడా అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. ప్రస్తుతం ఉపాధిపనులు లేవు. వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. అడపా దడపా వర్షాలు కారణంగా వారం రోజులనుంచి పెద్దగా పనులు కూడా లేవు. నాట్లు వేయడం, కలుపుతీత పారపనులకు వెళ్తే మహిళలకు రూ.300లు, మగవారికి రూ.750లు చెల్లిస్తున్నారు. వారం రోజుల్లో నాలుగు రోజులు మాత్రమేపనులుంటున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల గతంలో కంటే కూరగాయల పెంపకం చాలా వరకు తగ్గిపోయిందని, స్థానికంగా రైతులు కూరగాయాలు పంటలు వేయకపోవడంతో దూరప్రాంతాల్లో పండించి తెచ్చే రైతుల వద్ద కొనుగోలు చేసి విక్రయించాల్సి వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు.

తగ్గిన కూరగాయల సాగు

కూరగాయల సాగు రోజురోజుకు తగ్గిపోతోంది. దీంతో అరకొరగా పండించిన రైతుల వద్ద కొనుగోలు చేసి టోకు పద్ధతిలో విక్రయిస్తున్నాం. పెద్దగా లాభాలు వేసుకోవడం లేదు. పెట్టుబడితోపాటు రోజువారి కూలి గిట్టుబాటు అయితే చాలు అన్నట్లుగానే వ్యాపారం చేస్తున్నాం.రైతుల దగ్గర కొనుగోలు చేసిన దాన్ని బట్టి రైతు బజార్లో వ్యాపారులంతా నిర్ణయించిన ధరలకే విక్రయించడం జరుగుతోంది. ఈ మధ్య కాలంలో కూరగాయల ధరలు పెరిగిన మాట వాస్తవమే.

–నాగసత్యనారాయణ, కూరగాయల వ్యాపారి, పాయకరావుపేట

రెండొందలకు రెండే కూరలు

గతంలో ఎప్పుడూ లేనంతగా ధరలు పెరిగాయి. కిలో చిక్కుడు కాయలు రెండొందలంట,ఎం తింటాం సెప్పండి, ఆ మధ్య వరకు టమాట కేజీ వందరూపాయలకు అమ్మేరు.కొందామన్న దొరకనేదు. ఇప్పుడయిన తగ్గిందా అంటే కేజీ నలభైరూయాలంట,రెండొందలట్టుకెల్తే రెండుకూరలొత్తన్నాయి. ఇక పప్పు, ఉప్పు ధరలు, సింతపండు ధరలుకూడా పెరిగిపోనాయి. కందిపప్పు కేజీ 160రూపాయలంట. సింతపండుకూడా రెండొందలే. చారుకాసుకోవడానికి కట్టంగానే ఉంది. అలా అని తినడం మానేలేంకదా. బతకడానికైనా అప్పోసప్పో చేసుకుని తినాలి కదా. కూలిపనులు సూత్తే సరిగా ఉంటం లేదు. ఇలాగే ఉంటే ముందు ముందు బతకడం సానా కట్టమే.

– లోవమ్మ, మహిళ, పాయకరావుపేట

హామీ సరే.. రోడ్డేది?

- కొరుప్రోలు గిరిజన గ్రామస్తుల ఆందోళన
- ఈ నెల 30న డోలు యాత్రకు సన్నాహాలు



కుటుంబ సభ్యులతో బైఠాయించి నిరసన తెలుపుతున్న కొరుప్రోలు గ్రామస్తులు

రోలుగుంట: తమ గ్రామానికి రహదారి ఏర్పాటు చేయాలని కోరుతూ కొరుప్రోలు, సమీప గ్రామాలకు చెందిన గిరిజనులు ఆందోళనకు దిగారు. ఆదివారం గ్రామస్తులు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు అధ్వర్యంలో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ఈ గ్రామాల్లో సరైన రహదారి లేక ప్రజలు ఎన్నో కష్టాలు పడుతున్నారన్నారు. రోడ్డు కోసం గతంలో ఆందోళన చేసినా అధికారుల స్పందన నామమాత్రమే అన్నారు. ఎం.కె.పట్నం పంచాయతీ శివారు కొరుప్రోలుకి చెందిన పీవీటీజీ ఆదివాసీ కొందుల కులానికి చెందిన పది కుటుంబాలు, కోతులపాలెం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు, ఎం.కె.పట్నంకు చెందిన 40 దళిత కుటుంబాల వారి భూములున్నాయి. రోడ్డు సౌకర్యం లేక వారంతా గట్లు దాటుకుంటూ కాలినడక బాటలో రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. అలాగే ఒకటో తేదీన పింఛన్ల కోసం, ఇంట్లో నిత్యావసర సరకుల కోసం ఎం.కె.పట్నం పంచాయతీ కేంద్రానికి రావాల్సిందే. ఈ సమస్యపై గతంలో పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో అప్పటి కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ పీడీ, ఎంపీడీవో ప్రభాకర రావు, తహసీల్దార్ వరహాలు సచివాలయ సిబ్బందితో వచ్చి రోగులు డోలీ మోతతో వెళ్తుండడాన్ని చూసి, రోడ్డు నిర్మాణానికి హామీ ఇచ్చారు. తరువాత పంచాయతీరాజ్ అధికారులు కూడా వచ్చి సర్వే చేశారు. రోడ్డు నిర్మాణం కోసం రూ.1.50 కోట్లు ఉపాధి హామీ పథకం ద్వారా మెటీరియల్ కాంపొనేట్ నిధుల అంచనా వేసి ప్రతిపాదన కలెక్టర్‌కు నివేదించారు. సుమారు 4 నెలలు గడిచింది. ఇప్పటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఈ నేపథ్యంలో తక్షణమే రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టకుంటే ఈ నెల 30న డోలు యాత్ర నిర్వహిస్తామని గోవిందరావు తెలిపారు. ఈ ఆందోళనలో పీటీజీ సంఘం నాయకులు కె.సుబ్బారావు, కొర్రా ఆనంద్, గెమ్మిలి వాసు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో శ్రీకృష్ణ సెంటర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వెంకట సన్యాసినాయుడు

తుమ్మపాల: ఇటీవల జరిగిన బీకేఎస్ అయ్యంగార్ మెమోరియల్ 8వ జాతీయస్థాయి ఓపెన్ యోగా చాంపియన్‌షిప్– 2024 ఆన్‌లైన్ పోటీల్లో తుమ్మపాలకు చెందిన శ్రీకృష్ణ యోగ సెంటర్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచినట్టు యోగా టీచర్ బుదిరెడ్డి నరసింగరావు తెలిపారు. బెంగళూర్‌కు చెందిన ఆదిత్య సాయి యోగా సెంటర్, శివజ్యోతి యోగ కేంద్ర, ఓం యోగ అండ్ హెల్త్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో రెండేళ్ల వయసు విభాగంలో 5, 6 స్థానాలను టి.షణ్ముఖ, ఎస్.వికాస్ కుమార్, 12 నుంచి 15 ఏళ్ల వయస్సు క్యాటగిరీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను వరుసగా బి.జయశ్రీ, జి.విశ్వశ్రీ, ఎన్.హేమ వెంకట్ సాధించారు. 15 నుంచి 20 ఏళ్ల వయస్సు కేటగిరీలో తృతీయ స్థానంలో ఎం.కునాల్, 20 నుంచి 25 ఏళ్ల కేటగిరీలో తృతీయ స్థానంలో బి.హేమ, 50 నుంచి 60 ఏళ్ల కేటగిరీలో బుదిరెడ్డి నరసింగరావు, బి.నాగమణి, లక్ష్మి, సీహెచ్ పుష్ప వరుసగా ప్రథమ, ద్వితీయ, నాలుగు, ఐదు స్థానాలను కైవసం చేసుకున్నారు. మరో 11 మంది కన్సోలేషన్ బహుమతులు పొందారని ఆయన చెప్పారు. బెస్ట్ యోగ టీచర్ అవార్డు యోగ సెంటర్ టీచర్ బుదిరెడ్డి నరసింగరావుకు లభించింది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో విజేతలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాజీ సర్పంచ్ వెంకట సన్యాసినాయుడు పాల్గొన్నారు. గ్రామపెద్దలు మార్టూరు అజయ్, నడిపల్లి బోసు బాబు, బుదిరెడ్డి సూరిబాబు, గొంతిన వెంకట్రావు, గొంతిన శ్రీను, నానుబిల్లి నాగేశ్వరరావు తదితరులు విజేతలను అభినందించారు.

పలువురు ఉన్నతాధికారుల బదిలీ



డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ నాయుడు



డ్వామా పీడీ పూర్ణిమాదేవి



జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో డీఆర్‌డీఏ పీడీ, జెడ్పీ డిప్యూటీ సీఈవో, డీఎఫ్‌వోతో పాటు పలువురు అధికారులకు బదిలీ అయింది. వీరి స్థానంలో కొత్త అధికారులను నియమించారు. జిల్లా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) పీడీగా డి.వి.విద్యాసాగర్ నాయుడు, జిల్లా డీఎఫ్‌వోగా ఎం.శామ్యూల్ నియమితుల య్యారు. ఉమ్మడి విశాఖ జిల్లా డ్వామా పీడీగా పూర్ణిమాదేవి, జెడ్పీ సీఈవోగా పి.నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవోగా కె.రాజ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా ఎ.ఎస్.ఎ.రామస్వామిలను నియమిస్తూ ఆదివారం ఏపీ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. అనకాపల్లి జిల్లాలో డీఆర్‌డీఏ పీడీగా పనిచేసిన లక్ష్మీపతికి బదిలీ అయిన తరువాత నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉండడంతో ప్రస్తుతం ఇన్‌ఛార్జిగా శచీదేవి విధులు నిర్వహిస్తున్నారు. ఈ స్థానంలో విద్యాసాగర్ నాయుడు నియమితులయ్యారు. ఈయన శ్రీకాకుళం జిల్లా డ్వామా విభాగంలో ఏవోగా ప్రస్తుతం పనిచేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా డ్వామా పీడీగా నియమితులైన పూర్ణిమాదేవి విశాఖ జిల్లా డీఎల్‌డీవోగా ప్రస్తుతం పనిచేస్తున్నారు. అనకాపల్లి జిల్లా డీఎఫ్‌వోగా(నాన్ కేడర్ డివిజన్)గా నియమించిన ఎం.శామ్యూల్ మంగళగిరిలో గల ఏపీ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(హెచ్‌ఆర్‌డీ)గా పనిచేస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సీఈవోగా నియమితులైన పి.నారాయణమూర్తి ప్రస్తుతం కాకినాడ డీఎల్‌డీవోగా పనిచేస్తున్నారు. జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా నియమితులైన కె.రాజ్‌కుమార్ విజయనగరం డీఎల్‌డీవోగా పనిచేస్తున్నారు. ఒంగోలులో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా పనిచేస్తున్న ఎ.ఎస్.ఎ రామస్వామి అనకాపల్లికి బదిలీ అయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్న డి.సత్యనారాయణ శ్రీకాకుళానికి బదిలీ అయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లాల డ్వామా పీడీగా పనిచేస్తున్న సందీప్‌ను విజయనగరానికి బదిలీ చేశారు. అనకాపల్లి జిల్లా డీపీవోగా వి. శాంతామణిని నియమించారు. ఈమె ప్రస్తుతం కొవ్వూరు జిల్లా డీఎల్‌డీవోగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో పనిచేస్తున్న డీపీవో శిరీషరాణిని బదిలీ చేశారు. ఈమెకు ఎక్కడి పోస్టింగ్ ఇవ్వలేదు.

ఉమ్మడి విశాఖలో 16 మంది తహసీల్దార్ల బదిలీ

మహారాణిపేట(విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లాలో 16 మంది తహసీల్దార్లను జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ బదిలీ చేశారు. వీరిలో ఎనిమిది మందిని విశాఖ జిల్లాకు.. ఐదుగుర్ని అనకాపల్లి జిల్లాకు.. ముగ్గురు అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేశారు. ఏఎస్‌ఆర్ జిల్లా నుంచి వచ్చిన ఎం.బి.అప్పారావును విశాఖ కలెక్టరేట్ మెజిస్టీరియల్ సెక్షన్‌కు, పి.లచ్చాపాత్రుడ్ని మహారాణిపేట తహసీల్దార్‌గా, అనకాపల్లి నుంచి వచ్చిన ఎస్.రాణిఅమ్మాజీని ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ తహసీల్దార్‌గా నియమించారు. అలాగే అనకాపల్లి నుంచి వచ్చిన కె.జానకమ్మను విశాఖ జిల్లా ఆర్‌డీవో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా, పెదగంట్యాడ తహసీల్దార్ ఎల్.రామారావును అనకాపల్లి జిల్లాకు, విశాఖ జిల్లాలో తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎ.శ్రీనివాసరావు అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు. ఆర్‌డీవో ఏవోగా ఉన్న కె.రమాదేవిని అనకాపల్లి జిల్లాకు, ఏఎస్‌ఆర్ నుంచి వచ్చిన ఎస్.నాగమ్మను అనకాపల్లి జిల్లాకు, ఏఎస్‌ఆర్ జిల్లా నుంచి వచ్చిన ఎ.వేణుగోపాల్‌ను అనకాపల్లి జిల్లాకు, విశాఖ కలెక్టరేట్‌లో పనిచేస్తున్న వి.శ్యామ్ కుమార్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీ చేశారు. అనకాపల్లి జిల్లా నుంచి వచ్చిన కె.జయప్రకాష్‌ను అల్లూరి జిల్లాకు.. అనకాపల్లి నుంచి వచ్చిన ఎం.వి.వి. ప్రసాద్‌ను అల్లూరి జిల్లాకు బదిలీ చేశారు. శ్రీకాకుళం నుంచి విశాఖ వచ్చిన పి.అమలను పెదగంట్యాడ తహసీల్దార్‌గా, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి వచ్చిన డి.రవిని విశాఖ కలెక్టరేట్‌లో కో–ఆర్డినేషన్ కమిటీ తహసీల్దార్‌గా, పార్వతీపురం మన్యం జిల్లా నుంచి వచ్చిన ఎం.భుజంగరావును ములగాడ తహసీల్దార్‌గా , ములగాడ తహసీల్దార్ తారకేశ్వరిని జీవీఎంసీ ఎస్టేట్ ఆఫీసర్‌గా నియమించారు.

అంకుర వికాసం.. ఉపాధికి ఊతం

- యూఎస్ ఏజెన్సీతో ఒప్పందం కుదుర్చుకున్న ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చర్చలు సఫలీకృతం

సాక్షి, విశాఖపట్నం : ఆవిష్కరణలు, స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ అయిన ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ అడుగులు వేస్తోంది. రాష్ట్రంలో అంకురిస్తున్న స్టార్టప్‌లకు కొత్త అవకాశాలను సృష్టించేందుకు యూఎస్ సొసైటీకి చెందిన స్టార్టప్ రన్ వే అనే సంస్థతో జతకట్టింది. ఐటీ రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు స్టార్టప్‌లకు చేయూతనందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉన్న అవకాశాలన్నింటినీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించింది. 2022–23లో పలు మార్లు యూఎస్ ఏజెన్సీతో ఏపీఐఎస్ ప్రతినిధులు చర్చలు జరిపారు. ప్రభుత్వ విధానాలకు సంతృప్తి చెందిన స్టార్టప్ రన్‌వే సంస్థ.. రాష్ట్రంలోని అంకుర సంస్థలకు చేయూతనందించేందుకు అంగీకారం తెలిపింది. ఈ ఏజెన్సీ ఇప్పటికే రాష్ట్రం నుంచి రెండు స్టార్టప్‌లను ఎంపిక చేసింది. విశాఖలోని ఐటీ సెజ్‌లో ఉన్న గ్లోబల్ క్లైమేట్ రిస్క్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (జీసీఆర్‌ఎస్), అంతర్ ఐవోటీ సంస్థలకు గ్లోబల్ చేయూతనందించే ప్రక్రియ ప్రారంభమైంది.

గ్లోబల్ ఫండింగ్‌తో స్టార్టప్‌ల వృద్ధి : మరిన్ని స్టార్టప్‌లను ఎంపిక చేసి, గ్లోబల్ ఫండింగ్ ద్వారా వనరులు సృష్టించి.. ఆ సంస్థలు విజయవంతం అయ్యేందుకు అవసరమైన సహకారాన్ని యూఎస్ ఏజెన్సీ అందజేయనుంది. కార్పొరేట్ భాగస్వాములతో స్టార్టప్ ప్రతినిధులను జతకట్టించి.. సంస్థల అభివృద్ధికి పెట్టుబడిదారులు, పరిశ్రమల నిపుణులను అందించేందుకు సహకరిస్తుంది. తద్వారా గ్లోబల్ నెట్‌వర్క్ మెరుగుపరచడంతో పాటు మార్కెట్‌ను పెంపొందించడం, నిధుల అవకాశాలను సృష్టించడం, అంతర్జాతీయ మార్కెట్‌లోకి ఆహ్వానించి.. స్టార్టప్‌లు కీలక సంస్థలుగా బలోపేతం చేసేందుకు ఏపీఐఎస్ దోహదపడుతుంది. ప్రస్తుతం గ్రీన్, సస్టైనబుల్ ఎనర్జీ, ఏఐ, బ్లాక్‌చెయిన్, సైబర్ సెక్యూరిటీ తదితర సాంకేతికతలపై పనిచేస్తున్న స్టార్టప్‌లు, ఇంక్యుబేటర్లను ఇందులో భాగస్వామ్యం చేసేందుకు ఏపీఐఎస్ అన్వేషిస్తోందని సంస్థ ప్రతినిధి అనిల్‌కుమార్ తెలిపారు.

అంతర్ స్టార్టప్ : ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, నెక్స్ట్ జెన్ టెక్నాలజీలో ప్రత్యేకత కలిగిన స్టార్టప్ అంతర్. సురక్షితమైన, అధిక నాణ్యత, సాంకేతికంగా అధునాతనమైన స్మార్ట్ ఉత్పత్తుల శ్రేణిని అభివృద్ధి చేస్తారు. ఐవోటీ సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫారమ్ ద్వారా సంస్థల కార్యచరణ సామర్థ్యాలు మెరుగుపరిచేలా సొంత స్మార్ట్ ఉత్పత్తులు అందిస్తోంది. స్మార్ట్ మాడ్యుల్–ఎక్స్‌పీ, 2ఎక్స్ పవర్ స్మార్ట్ హోమ్, గేట్‌వే సాఫ్ట్‌వేర్, సెన్సార్లు మొదలైన ఉత్పత్తులు కీలక సంస్థలకు అందజేస్తోంది. అంతర్ ఐవోటీ ప్లాట్‌ఫారమ్ ద్వారా రియల్‌టైమ్ డివైజ్ మానటరింగ్ మేనేజ్‌మెంట్, డేటా అనాలసిస్, యూజర్ ఫ్రెండ్లీ డాష్‌బోర్డ్, సెక్యూర్ ఇన్‌ఫ్రా తదితర సౌకర్యాలు కల్పించనుంది. ఈ సంస్థను కూడా స్టార్టప్ రన్‌వే సంస్థ ఎంపిక చేసింది.

జీసీఆర్‌ఎస్ స్టార్టప్: పర్యావరణ సుస్థిరతకు సంబంధించిన సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన ఆవిష్కరణలతో జీసీఆర్‌ఎస్ స్టార్టప్ పనిచేస్తోంది. ఈ సంస్థలోని నిపుణుల బృందం ఎన్విరాన్‌మెంటల్ కన్సల్టెన్సీ, సలహా సేవలను అందించడమే కాకుండా విభిన్న సంస్థలకు సంబంధించిన ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక పరిష్కారాలు, సాంకేతికతను అభివృద్ధి చేసి అందిస్తుంటుంది. ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్‌లు, విద్య, పరిశోధన సంస్థలతో ఈ స్టార్టప్ జతకట్టింది. ప్రస్తుతం ఈ సంస్థ యూఎస్ ఏజెన్సీ చేయూతనందించేందుకు ఎంపికైంది.

క్లుప్తంగా

ఏలేరు కాలువలో మృతదేహం లభ్యం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన కొండకొప్పాక సమీపంలో ఏలేరు కాలువ నాగమ్మ బ్రిడ్జి వద్ద సుమారు 35 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగిన పురుషుని మృతదేహం లభించినట్టు రూరల్ ఎస్‌ఐ సత్యనారాయణ ఆదివారం చెప్పారు. వంతెన వద్ద మృతదేహం ఉండడాన్ని అటుగా వెళ్లిన రైతు గుర్తించి, కొండకొప్పాక వీఆర్‌ఏ డి.వెంకటరమణకు సమాచారం అందజేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. సుమారు నెల రోజుల క్రితం కాలువలోపడి మృతిచెంది ఉండవచ్చని చెప్పారు. ముఖం, శరీరభాగాలను కాలువలో ఉన్న చేపలు, ఇతర జంతువులు తినివేయడంతో గుర్తుపట్టలేని విధంగా మృతదేహం ఉన్నట్టు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టానికి మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి, వీఆర్‌ఏ వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

1500 లీటర్ల సారా పులుపు ధ్వంసం


సారా పులుపు, సామగ్రితో పోలీసులు

కోటవురట్ల: మండలంలోని బి.కె.పల్లి రెవెన్యూ పరిధిలోని తాండవ కాలువ సమీపంలో ఆదివారం 1,500 లీటర్ల సారా పులుపును ధ్వంసం చేసినట్టు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. సారా తయారు చేస్తున్నారన్న సమాచారంతో దాడి చేసినట్టు చెప్పారు. పులుపుతో పాటు తయారీ సామగ్రిని ధ్వంసం చేసినట్టు తెలిపారు.

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

మాకవరపాలెం: మండలంలోని భీమబోయిన పాలెంలో శనివారం రాత్రి పేకాటాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ దామోదర్ నాయుడు తెలిపారు. నిందితుల నుంచి రూ.5,000 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

టీటీడీలో నెయ్యిపై రాజకీయం తగదు

అనకాపల్లి: టీటీడీలో జరుగుతున్న నెయ్యి వ్యవహారంపై రాజకీయం తగదని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరనాథ్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటి వరకూ ఏ ముఖ్యమంత్రి కూడా ఇటువంటి తప్పుడు పనులు చేయమని చెప్పలేదన్నారు. నెయ్యి విషయంలో ఎక్కడ పొరపాటు జరిగిందో అక్కడే చర్యలు తీసుకుని, బాధ్యులను విధుల నుంచి తక్షణమే తొలగించాలని ఆయన కోరారు. దేవస్థానం చైర్మన్ పదవులను రాజకీయ పార్టీల నాయకులకు కాకుండా రాష్ట్రపతితో అవార్డు పొందిన ఎందరో మహానీయులు మన రాష్ట్రంలో ఉన్నారని, వారికి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

అప్పటివరకు ఎంతో ఉత్సాహంగా సాగిన వైద్య విద్యార్థుల విహారయాత్ర ఒక్కసారిగా ఊహించని మలుపు తిరిగింది. కొండల్లో కురిసిన భారీ వర్షానికి జలపాతం (వాగు) ఉన్నట్టుండి పొంగింది. అప్పటివరకు నీటిలో కేరింతలు కొడుతూ.. ఫొటోలు దిగుతూ.. ఉత్సాహంగా స్నానాలు చేస్తున్న వారిపై విరుచుకుపడటంతో ఐదుగురు కొట్టుకుపోయారు. వీరిలో ముగ్గురు గల్లంతు కాగా, ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు.

వాగులో వేదన

- జలతరంగిణి జలపాతంలో ఏలూరు ఆశ్రం వైద్య విద్యార్థులు ముగ్గురు గల్లంతు
- భారీ వర్షానికి ఉప్పొంగడంతో ప్రమాదం
- గాలింపు చర్యలు ముమ్మరం
- లభ్యం కాని ఆచూకీ


భారీ వర్షానికి ఉప్పొంగిన వాగు


ఇద్దరు విద్యార్థులు బయటపడిన ప్రాంతం

మారేడుమిల్లి: విహారయాత్రకు వచ్చిన వైద్య విద్యార్థుల్లో ముగ్గురు ఊహించని పరిస్థితుల్లో వాగు ప్రవాహానికి కొట్టుకుపోగా, ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. ఏలూరుకు చెందిన ఆశ్రం వైద్య కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న 14 మంది విద్యార్థులు ఆదివారం ఉదయం కాకినాడలోని స్నేహితుల ఇంటికి వచ్చారు. అక్కడి నుంచి నగరంలోని బీచ్‌కు వెళ్లి అక్కడ కాసేపు ఉత్సాహంగా గడిపారు. అందరూ గ్రూప్ ఫొటో దిగారు. అనంతరం వ్యాన్‌లో విహారయాత్రకు మారేడుమిల్లి వచ్చారు. అక్కడి నుంచి జలతరంగణి (వాగు) జలపాతం వద్దకు చేరుకున్నారు. అందరూ దిగి స్నానాలు చేస్తున్న సమయంలో ఒక్కసారిగా కొండల్లో భారీ వర్షం కురిసింది. రెట్టించిన ఆనందంతో కేరింతలు కొడుతున్న తరుణంలో ఉన్నట్టుండి వాగు ఉప్పొంగింది. ఇది గమనించిన తొమ్మిది మంది విద్యార్థులు ఒడ్డుకు వచ్చేశారు. ప్రవాహం మధ్యలో ఉన్న సీహెచ్ హరదీప్, కె.సౌమ్య, బి.అమృత, గాయత్రీ పుష్ప, హరిణీప్రియ కొట్టుకుపోయారు.

ఇద్దరిని కాపాడిన చెట్టుకొమ్మ

కొట్టుకుపోయిన ఐదుగురిలో గాయత్రీ పుష్ప, హరిణీప్రియ చెట్టుకొమ్మను పట్టుకోవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. సంఘటన జరిగిన ప్రాంతానికి ఆరు కిలోమీటర్ల దూరంలో భద్రాచలం ప్రధాన రహదారి కల్వర్టు వద్ద వీరిని స్థానికులు, రెస్క్యూ టీం గుర్తించారు. వెంటనే ఒడ్డుకు చేర్చారు. మిగతా హరిదీప్, సౌమ్య,అమృత ఆచూకీ లభ్యం కాలేదు. ప్రాణాలతో బయటపడిన హరిణీప్రియ పరిస్థితి విషమంగా ఉంది. వాగులో మునిగి నీళ్లు తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బండరాళ్ల కారణంగా గాయపడిన గాయత్రీ పుష్ప రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. గల్లంతైన వారికోసం రాత్రి ఏడు గంటల వరకు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. అయినప్పటికీ ఎటువంటి ఆచూకీ లభ్యం కాలేదని ఎస్‌ఐ రాము తెలిపారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే శిరీషాదేవి రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చిన ఇద్దరు వైద్య విద్యార్థులను పరామర్శించారు. చికిత్స పొందుతున్న గాయత్రీ పుష్పకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.




రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గాయత్రి పుష్ప, హరిణీప్రియ


కాకినాడ బీచ్‌లో గ్రూప్ ఫొటో

21న కళాశాలను విడిచి..

ఏలూరు టౌన్: ఈనెల 21న ఆశ్రం వైద్య కళాశాలకు చెందిన వైద్య విద్యార్థులు సెలవుపై ఇళ్లకు వెళ్లారని ఆ కళాశాల సీఈవో కె.హనుమంతరావు తెలిపారు. సెలవుపై వెళ్లిన వారిలో కొందరు తమ స్నేహితులతో కలిసి మారేడుమిల్లి విహారయాత్రకు వెళ్లగా ప్రమాదానికి గురయినట్లు తెలిసిందన్నారు. ఎవరు విహారయాత్రకు వెళ్లారు అనే దానిపై కళాశాల సిబ్బంది ఆరా తీస్తున్నారని తెలిపారు. కె.సౌమ్య, బి.అమృత ఇద్దరు యువతులు విజయనగరం, ఒక విద్యార్థి సీహెచ్ హరదీప్ ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన వారిగా ప్రాథమికంగా గుర్తించామన్నారు. ప్రమాద సంఘటనలో పరిస్థితులు తెలుసుకుంటూ ఉన్నామని సీఈవో తెలిపారు.

పర్యాటకులకు అనుమతి లేదు


కలెక్టర్ కల్పశ్రీ

మారేడుమిల్లి: రంపచోడవరం ఏజెన్సీలో భారీ వర్షాల కారణంగా వాగులు పొంగి ప్రవహిస్తున్నందున మారేడుమిల్లి తదితర అన్ని పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులను అనుమతించడం లేదని సబ్ కలెక్టర్ కల్పశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాలకు వచ్చే వారిని జలపాతాల వద్దకు అనుమతించ వద్దని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాలు తగ్గేవరకు ఈ నిబంధన కొనసాగుతుందన్నారు. కాగా పర్యాటక ప్రాంతాలకు వచ్చే వారు తిరిగి ఇళ్లకు వెళ్లే వరకు తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. వాగులు దాటే సాహసం చేయవద్దన్నారు.

శరన్నవరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం

- మాడుగులలో రాజుల సంప్రదాయాలతో నిర్వహణ
- 3 నుంచి వేడుకలకు శ్రీకారం


దేవీతల్లికి రంగులు అద్దిన దృశ్యం

మాడుగుల: దసరా వేడుకలకు ఉత్తరాంధ్రలోనే మాడుగుల ప్రసిద్ధి చెందింది. ఇక్కడ మత్స్యవంశ రాజులు పాలన నుంచి ఈనాటి వరకు అదే సంప్రదాయాలతో ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు మాడుగులలో వచ్చే నెల 3 నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. 9న ప్రత్యేక పూజలు చేయనున్నారు. అదే రోజు ఆనాడు రాజులు వాడిన ఆయుధాలతో కత్తి సాము, కర్ర సాముల ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు. రాజులు వాడిన ఆయుధాలను తహసీల్దార్ కార్యాలయంలో భద్రపరిచారు. దసరా ఉత్సవాల్లో భాగంగా వీటిని శుభ్రం చేసి, ఆయుధ పూజలు నిర్వహించనున్నారు. దాతల సహాయంతో దేవీతల్లి విగ్రహానికి రంగులు అద్దారు. ఆలయానికి కూడా పెయింటింగ్ వేస్తున్నారు. శరన్నవరాత్రి వేడుకలకు ఆర్థిక సహాయం అందించిన భక్తులకు మంచి జరుగుతుందని స్థానికుల్లో ప్రగాఢ విశ్వాసం.

తీర్పు వచ్చే వరకు ఎస్సీ వర్గీకరణ చేయొద్దు

అనకాపల్లి: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టులో ఇప్పటికే రివ్యూ పిటిషన్ దాఖలు చేశామని, ఈ నెల 24న మొదట వాయిదా ఉందని అంబేడ్కర్ గ్లోబల్ మిషన్ అధ్యక్షుడు, సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ సభ్యుడు భయ్యే మల్లయ్య తెలిపారు. స్థానిక కొడుగంట గోవిందరావు భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టులో తమకు అనుకూలంగానే తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో లేని వర్గీకరణ సూచిస్తూ ఎలా తీర్పునిస్తారని పిటిషన్ వేశామన్నారు. ఈ విషయమై ప్రభుత్వాలు ఎటువంటి తొందరపాటు చర్యలు తీసుకోకుండా పాత పద్ధతిలోనే వర్గీకరణ లేకుండానే, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు. ఇటీవల దళిత వైద్యులపై జరిగిన దాడులను ప్రభుత్వం తక్షణమే ఖండించాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. అంతకు ముందు నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ మిషన్ ప్రధాన కార్యదర్శి సువర్ణ రత్నం, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేబాక మధుబాబు, మార్తి అప్పలరాజు, మాల మహానాడు రాష్ట్ర నాయకుడు సియాద్రి శ్రీను, వివిధ సంఘాల నాయకులు రాజాన బుజ్జి, రాహుల్, మరువాడ ఈశ్వరరావు, మరియమ్మ, పల్లా బాబ్జి, కటారి దేవుడు, ఉడత రాముడు, గుంటూరు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కౌన్సిల్‌తో ప్రజలకు రక్షణ

అనకాపల్లి: మానవ హక్కుల కౌన్సిల్ ప్రజల రక్షణకు కవచంగా నిలుస్తోందని కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి శ్యాంప్రసాద్ తెలిపారు. స్థానిక జార్జ్ క్లబ్ ఆవరణలో ఆదివారం జరిగిన మానవ హక్కుల జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాల నివారణకు కౌన్సిల్ సభ్యులు గ్రామ స్థాయి నుంచి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వ్యక్తులపై ఫిర్యాదు చేసేందుకు చొరవ చూపాలన్నారు. గత 20 ఏళ్లుగా ప్రజలకు కౌన్సిల్ విస్తృత సేవలు అందించడంపై ఏపీ హైకోర్టు న్యాయమూర్తి యు.దుర్గాప్రసాద్ అభినందించారని ఆయన తెలిపారు. నేటి వరకూ చట్టాలను ఉల్లంఘించిన వారిపై 6వేలు కేసులు నమోదు కాగా.. వాటిలో 1200 కేసులకు తీర్పు వెలువడినట్లు వివరించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, అడవులను పెంచడం వంటి కార్యక్రమాలపై దృష్టి సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. నవంబర్‌లో జిల్లాలో కౌన్సిల్ సభ్యులకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర చీఫ్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఎస్.వి.రమణ మాట్లాడుతూ రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ఉల్లంఘిస్తే ఎటువంటి చర్యలు తీసుకోవచ్చనే అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల జిల్లా కౌన్సిల్ సభ్యులు మళ్ల సన్యాసినాయుడు, బి.సురేష్, వివిధ మండలాల సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్న ఆస్తుల పరిరక్షణే ధ్యేయం

సింహాచలం ఈవోగా త్రినాథరావు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆస్తుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. దేవస్థానం ఈవోగా త్రినాథరావు ఆదివారం సింహగిరిపై బాధ్యతలు స్వీకరించారు. దేవస్థానం ఇన్‌చార్జిగా ఈవోగా ఉన్న దేవదాయశాఖ విశాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత ఆయనకు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ సింహాచలం దేవస్థానానికి ఇప్పటివరకు మూడు సార్లు ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తించానని, ఇప్పుడు బదిలీపై పూర్తిస్థాయి ఈవోగా రావడం సంతోషంగా ఉందన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు మంచి వాతావరణంలో దర్శనం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటానన్నారు. అంతకుముందు ఆయన స్వామి వారిని దర్శించుకున్నారు. దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, డీఈ హరి, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి, రాజేంద్రకుమార్, పిల్లా శ్రీనివాసరావు, సూపరింటిండెంట్లు తదితరులు ఈవోని కలిసి అభినందలు తెలిపారు.

కారు ఢీకొని యువకుడి దుర్మరణం


దుర్గారావు (ఫైల్)


నక్కపల్లి: జాతీయ రహదారిపై ఉద్దండపురం జంక్షన్ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. గ్రామానికి చెందిన ఆవాల దుర్గారావు(35) రోడ్డు దాటుతుండగా తుని నుంచి విశాఖపట్నం వెళ్తున్న కారు ఢీకొట్టింది. వెంటనే ఆయనను స్థానికులు, కుటుంబ సభ్యులు తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తలకు బలమైన గాయం కావడంతో అప్పటికే మరణించినట్టు డాక్టర్లు చెప్పారు. మృతుడికి భార్య, కుమారుడు, వారం క్రితం పుట్టిన కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హెచ్‌సీ వెంకటరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కెమికల్ డ్రగ్స్ పరిశ్రమలో ప్రమాదం

కాంట్రాక్ట్ కార్మికుడికి తీవ్ర గాయాలు

పరవాడ: జేఎస్ ఫార్మాసిటీలో కెమిక డ్రగ్స్ పరిశ్రమలో శనివారం జరిగిన ప్రమాదంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు షవల్ షేక్(21) తీవ్రంగా గాయపడ్డాడు. పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలివీ.. పరిశ్రమలోని ఓ షెడ్డుకు రేకులు అమర్చడానికి కాంట్రాక్ట్ పద్ధతిలో కార్మికులను నియమించుకున్నారు. శనివారం షెడ్డుపై 20 అడుగుల ఎత్తులో షవల్ షేక్ పని చేస్తున్నాడు. షెడ్డుపై ఒక దగ్గర నుంచి వేరొక ప్రదేశానికి షిఫ్ట్ అవుతున్న క్రమంలో సేఫ్టీ బెల్ట్‌కు లింక్ తగిలిస్తుండగా.. అదుపు తప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతని తలకు బలమైన గాయాలయ్యాయి. తోటి కార్మికులు ప్రమాదాన్ని గుర్తించి యాజమాన్యానికి సమాచారం అందించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. వైద్య నిపుణులు అతనికి శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉంది. యాజమాన్యం ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లికార్జునరావు చెప్పారు. ప్రమాదంపై విచారణ జరిపి.. షేక్‌కు మెరుగైన వైద్యం అందించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు.

100 కిలోల లడ్డూ ఏర్పాటు


గణేష్ చెంతన 100 కిలోల లడ్డూ

అనకాపల్లి: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి చిరుబస్‌స్టాప్ ఎదురుగా గల గణపతి మండపంలో వంద కిలోల లడ్డూ ఏర్పాటు చేశారు. ఈ లడ్డూను ఈ నెల 27వ తేదీ సాయంత్రం 4 గంటలకు వేలం వేయనున్నట్టు వినాయక ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొరిబిల్లి ప్రశాంత్ తెలిపారు. వేలంపాటలో పాల్గొనే భక్తులు 8499939995 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ నెల 30న వినాయక నిమజ్జనోత్సవాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు.

టెన్త్ విద్యార్థి అదృశ్యం


రాంచరణ్ తేజ(ఫైల్)

యలమంచిలి రూరల్ : పదో తరగతి విద్యార్థి అదృశ్యంపై యలమంచిలి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు చేసినట్టు యలమంచిలి పట్టణ ఎస్‌ఐ కె.సావిత్రి తెలిపారు. రాంబిల్లి మండలం వాడనర్సాపురం గ్రామానికి చెందిన సూరాడ దుర్గ కుమారుడు రాంచరణ్ తేజ (14) అచ్యుతాపురం బీసీ హాస్టల్‌లో ఉంటూ అక్కడే ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. వినాయక చవితి సందర్భంగా రాంచరణ్ తేజ ఎస్.రాయవరం మండలం రేవు పోలవరంలో ఉన్న తన అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. అప్పట్నుంచి తిరిగి హాస్టల్, స్కూళ్లకు వెళ్లకుండా రేవుపోలవరంలో ఉన్న అమ్మమ్మ ఇంటి దగ్గరే ఉండిపోయాడు. 10వ తరగతి చదువుతున్న తన కుమారుడి చదువు పాడైపోతుందని ఈ నెల 21న తల్లి సూరాడ దుర్గ రేవు పోలవరం వెళ్లి రాంచరణ్ తేజను అచ్యుతాపురంలో హాస్టల్‌కు తీసుకువెళ్లడానికి అడ్డరోడ్డులో యలమంచిలి వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కి యలమంచిలి కాంప్లెక్సులో బస్సు దిగుతున్న సమయంలో తనకంటే ముందు బస్సు దిగిన తన కుమారుడు రాంచరణ్ తేజ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా అదృశ్యమైన రాంచరణ్ తేజ ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం యలమంచిలి పట్టణ పీఎస్‌లో తల్లి దుర్గ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్‌ఐ సావిత్రి తెలిపారు.

గండి బాబ్జీ వేధింపుల నుంచి కాపాడండి


గండి వేధింపులపై మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలోని అంతర్గత కుమ్ములాటలు రోడ్డు మీదకు వచ్చాయి. టీడీపీ నగర అధ్యక్షుడు, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీపై అదే పార్టీకి చెందిన మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వర్గీయులు తీవ్ర ఆరోపణలు చేశారు. పెందుర్తి మండలం చింతగట్లలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ ముఖ్య నాయకులు ఉప్పిలి చిన్నారావు, దాసరి రమణ, చీపురపల్లి నర్సింగరావు, నందవరపు సన్యాసిరావు తదితరులు గండి బాబ్జీపై ధ్వజమెత్తారు. వారు మాట్లాడుతూ బండారు సత్యనారాయణమూర్తి మాడుగుల వెళ్లిపోవడంతో గండి బాబ్జీ తమపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సొంత పార్టీ కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయిస్తు వేధిస్తున్నారన్నారు. బండారు వర్గీయుడైన దమ్ము రమేష్ అనే కార్యకర్తపై రౌడీషీట్ పెడతామని బాబ్జీ హెచ్చరిస్తున్నారన్నారు. తమ ప్రత్యర్థులకు గండి బాబ్జీ వత్తాసు పలుకుతూ తమను అన్నివిధాల ఇబ్బందులకు గురి చేస్తున్నామని చెప్పారు. దీనిపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు ఫిర్యాదులు చేస్తామని.. వారు స్పందించకపోతే పార్టీకి రాజీనామాలు చేస్తామని హెచ్చరించారు. పార్టీ పెద్దలను ఒకటి రెండు రోజుల్లో కలిసేందుకు వెళుతున్నామని పేర్కొన్నారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

- రూ.లక్ష విలువైన వెండి ఆభరణాల చోరీ


సాయిబాబా విగ్రహం నెత్తిన మాయమైన వెండి కిరీటం

చోడవరం రూరల్ : స్థానిక సాయిబాబా ఆలయంలో పట్టపగలు చోటు చేసుకున్న చోరీ సంఘటన ఆదివారం వెలుగు చూసింది. ఈ చోరీలో సుమారు లక్ష రూపాయల విలువ చేసే స్వామి వారి వెండి కిరీటం, సింహపు వెండి తొడుగు తస్కరణకు గురయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ బి.అప్పలరాజు తెలిపిన వివరాల ప్రకారం సాధారణ భక్తుల మాదిరిగా ఓ వ్యక్తి మూడు రోజులుగా ఆలయానికి వచ్చారు. శనివారం యధావిధిగా ఆలయానికి చేరుకుని సాయిబాబా స్తుతిలో నిమగ్నం అయ్యాడు. ఉదయం సుమారు 11 గంటల సమయంలో ఆలయ పూజారి లఘు శంక కోసమని ఆలయం మేడపై నుంచి కిందికి దిగిన సమయంలో అదే అదునుగా భావించిన దొంగ స్వామి వారి తలపై ఉన్న వెండి కిరీటం, సింహం తొడుగులను దొంగిలించి ఉడాయించాడు. ఆలయానికి తిరిగి వచ్చిన పూజారి గంట గడిచాక గానీ చోరీ జరిగిన సంగతిని గుర్తించలేదు. పరిశీలనగా చూశాక చోరీ జరిగినట్టు తెలియడంతో చోడవరం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా దొంగ ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు.

దళారులకే మేలు


నిరసన వ్యక్తం చేస్తున్న లారీ యజమానులు

- ఇసుక ఆన్‌లైన్ విధానంతో అవస్థలు
- వినియోగదారునికి నష్టం, లారీ యజమానులకు కష్టం
- జిల్లా క్వారీ లారీ యజమానుల సంఘం ప్రతినిధులు

తగరపువలస : కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ఇసుక ఆన్‌లైన్ విధానంతో దళారులకు మేలు జరుగుతుండగా, వినియోగదారునికి నష్టం, లారీ యజమానులకు కష్టం మిగులుతోందని జిల్లా క్వారీ లారీ యజమానుల సంఘం ప్రతినిధులు వాపోయారు. ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ బోయపాలెం వద్ద ఆదివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రైవేట్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఇసుకను ఆన్‌లైన్‌లో ఉంచినప్పుడు వినియోగదారునికి, లారీ యజమానులకు మేలు జరిగేదన్నారు. కూటమి ప్రభుత్వం ఉచితం పేరుతో ఆన్‌లైన్‌లో ఉంచిన ఇసుక కారణంగా వినియోగదారునిపై మోయలేని భారం, లారీ యజమానులకు అవమానాలు మిగులుతున్నాయన్నారు. ప్రస్తుతం అసోసియేషన్‌లో ఉన్న 600 మందికి పైగా యజమానులకు 2,500 వరకు లారీలు ఉన్నాయన్నారు. నగరంలోని వినియోగదారులు, లారీ యజమానుల కోసం రాజమండ్రి, శ్రీకాకుళంలో ఇసుక రీచ్‌లు తెరిచి ఇసుక అందుబాటులో ఉంచాలన్నారు. మన రాష్ట్రంలో ఇసుక రీచ్‌లు లేని కారణంగా ఒడిశాలోని 10 ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తెచ్చుకుంటున్నట్లు తెలిపారు. గతంలో అక్కడ టన్ను ఇసుక రూ.400 ఉండగా.. మన రాష్ట్రంలో విధానాల వల్ల రూ.1200కు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఆ ఇసుకను విశాఖకు తరలించేటప్పటికి రవాణా, పర్మిట్లు, టోల్‌గేట్ల చార్జీలు కలిసి టన్ను రూ.2 వేలకు చేరుతోందన్నారు.

కోట్లు దండుకుంటున్న కూటమి నేతలు

వారం రోజుల క్రితం శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస నియోజకవర్గం బూర్జ మండలం నారాయణపురం పరిధిలో తెరిచిన ఇసుక రీచ్ అక్కడి నాయకులు, అధికారులకు అప్పనంగా కోట్లు కురిపిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం టన్ను ఇసుక రూ.340గా నిర్ణయించి 5 వేల టన్నులు అందుబాటులో ఉంచితే అక్కడి వారే ఆధార్ కార్డులు, డీడీల ఆధారంగా ఇసుకను బ్లాక్ చేశారని తెలిపారు. 30 ఏళ్లుగా ఇసుక రవాణాపై ఆధారపడ్డ తమకు రూ.6,800 ఇసుకను బ్లాక్‌లో రూ.25 వేల నుంచి రూ.30 వేలకు విక్రయిస్తున్నారని ఆక్షేపించారు. దీనికి రవాణా చార్జీలు కలిపి నగరానికి తీసుకువచ్చేసరికి టన్ను రూ.1800కు చేరుతోందన్నారు. దీంతో తామే వినియోగదారుడిని మోసం చేస్తున్నట్టు కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు వెనక్కి తీసుకోవాలన్నారు. ఓవర్‌లోడు, రాంగ్ పార్కింగ్ పేరుతో పోలీసులు, మైనింగ్, విజిలెన్స్ అధికారుల దాడులు ఎక్కువగా ఉన్నాయన్నారు. వీటిని రద్దు చేయకపోతే లారీలను నిలిపివేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్లు కొయ్య శ్రీనివాసరెడ్డి, బొట్ట సురేష్, జాయింట్ సెక్రటరీలు ఉప్పులూరి శ్రీనివాసరావు, దాసరి భాస్కరరావు సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపటి నుంచి సదరం క్యాంపు

అనకాపల్లి : స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న సదరం (ఎన్టీఆర్ భరోసా పెన్షన్ వెరిఫికేషన్) క్యాంపు సోమవారం స్వచ్ఛతా హీ సేవా–2024 కారణంగా మంగళవారానికి వాయిదా వేసినట్లు వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 24న రావికమతం, రోలుగుంట, మాడుగుల, 25న దేవరాపల్లి, బుచ్చియ్యపేట, చీడికాడ, 26న ఎస్.రాయవరం, మాకవరపాలెం, చీడికాడ మండలాల దివ్యాంగులకు సదరం క్యాంపు ఎన్టీఆర్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. గతంలో సదరం సర్టిఫికెట్‌లో 80 శాతం పైబడిన దివ్యాంగులు మాత్రమే క్యాంపునకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

అనారోగ్యంతో ఇంటర్ విద్యార్థిని మృతి

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరంలోని ఎస్ఆర్ అకాడమీలో ఇంటర్మీడియట్ బైపీసీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని కె.భార్గవి (17) జ్వరం, తలనొప్పి, ఒంటి నొప్పులతో బాధపడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. కళాశాల యాజమాన్యం చికిత్స కోసం అదేరోజు మధురవాడ గాయత్రి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఆనందపురం పోలీసులు తెలిపారు. మృతురాలిది అనకాపల్లి జిల్లా కశింకోట మండలం జి.భీమవరం. మృతురాలి తల్లిదండ్రులు అప్పలరాజు, వెంకట ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సత్తా చాటిన గురుకుల విద్యార్థులు

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగిన మండల క్రీడా పోటీలు ముగిసాయి. ఈ పోటీలలో తెనుగుపూడి డా.బీఆర్. అంబేడ్కర్ గురుకుల విద్యాలయం విద్యార్థులు అండర్–17 బాలుర విభాగంలో ఖోఖో, వాలీబాల్, చెస్‌లో విజేతలుగా నిలిచారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో దేవరాపల్లి హైస్కూల్ విద్యార్థులు, కబడ్డీలో దేవరాపల్లి కైరళి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. అండర్–14, అండర్–17 బాలికల విభాగంలో డిస్కస్ త్రో లో ఎ. కొత్తపల్లి హైస్కూల్ విద్యార్థులు ఎస్.నాగమణి, పి.అఖిల నిలిచారు. అండర్–14, అండర్–17 బాలుర విభాగంలో డిస్కస్ త్రోలో ఎ. కొత్తపల్లి హైస్కూల్‌కు చెందిన సతీష్, జశ్వంత్ విజేతలుగా నిలిచారు. అండర్–17 బాలికల 600 మీటర్ల రన్నింగ్‌లో వేచలం హైస్కూల్ విద్యార్థిని రామలక్ష్మి, 800 మీటర్ల రన్నింగ్‌లో కేజీబీవీ విద్యార్థిని శ్రీలక్ష్మి, 100 మీటర్ల కేజీబీవీ విద్యార్థిని టి.శ్రీలక్ష్మి విజేతలుగా నిలిచారు. అండర్–17 బాలుర 100 మీటర్ల రన్నింగ్‌లో వేచలం విద్యార్థి బి. చైతన్య, అండర్–14 100 మీటర్ల రన్నింగ్‌లో వేచలం విద్యార్థిని టి.సిమ్రాన్, అండర్–17లో 200 మీటర్ల బాలికల విభాగంలో వేచలం విద్యార్థి బి. చైతన్య విజేతలుగా నిలిచారు. వీరికి ఎంఈవో బి.పడాల్‌దాస్, వి. ఉషారాణి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఈటీ జి.తరుణేశ్వరరావు, పీడీలు బి.బాబూరావు, ఆర్.తమ్మునాయుడు, సూర్యప్రకాష్, కుమారి, కె.కృష్ణ, ఎస్.నాగేశ్వరరావు, కె.విజయ్,సంతోష్ పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

గొర్రె పురాణం	:రాజా
ఏఆర్ఎం 3డీ	:సత్యనారాయణ స్క్రీన్-1
మత్తు వదలరా 2	: సత్యనారాయణ స్క్రీన్-2
ఆయ్	: పర్తిసాయి
సరిపోదా శనివారం	: షిర్డీసాయి
చిక్లెట్స్	:వెంకటేశ్వర
మన్యం ధీరుడు సీతారామరాజు	:శ్రీసత్య
హైడ్ ఎన్ సీక్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 34 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-5 యూనిట్లు, బి పాజిటివ్-20 యూనిట్లు, ఓ పాజిటివ్-4 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 216 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 199 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

రహదారి శిథిలం.. కష్టాలు అనంతం

- అధ్వానంగా జమాదులపాలెం రోడ్డు
- గోతులు పడి ప్రయాణం నరకప్రాయం
- అధికారుల తీరుపై ప్రజల మండిపాటు


బురదమయంగా మారిన జమాదులపాలెం రోడ్డు


గోతులతో నిండి ఉన్న రోడ్డు

మండలంలోని జమాదులపాలెం గ్రామానికి వెళ్లే జాతీయ రహదారి అధ్వానంగా ఉంది. పెద్ద గోతులు పడి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహన చోదకులు, ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దాదాపు దశాబ్ద కాలంగా ఇదే పరిస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రహదారి అధ్వానంగా ఉండటం వల్ల **అత్యవసర** సమయాల్లో ప్రయాణికులను **వేగంగా** గమ్యాలకు చేర్చలేకపోతున్నామని ఆటోడ్రైవర్లు వాపోతున్నారు.

కశింకోట: జమాదులపాలెం గ్రామ పంచాయతీ సుమారు 2500 జనాభా కలిగి ఉంది. ఈ గ్రామానికి జాతీయ రహదారి నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరం పంచాయతీరాజ్ శాఖ రోడ్డు ఉంది. దీనిని దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు దాదాపు దశాబ్దం క్రితమే చాలా వరకు ధ్వంసం అయింది. వలుచోట్ల పెద్ద గోతులు పడ్డాయి. ఈ రోడ్డులో భాగంగా ఉన్న ఏలేరు కాలువపై వంతెన బలహీనంగా ఉంది. వంతెనకు రెండు వైపులా గోతులు పడి ఉంది. దీంతో ఏ మాత్రం వర్షం వచ్చినా గోతుల్లో నీరు చేరి అవి కానరాక పోవడంతో వాటిలో ఒక్కొక్కసారి వాహన చోదకులు పడి గాయాలపాలు అవుతున్నారు. ప్రయాణికులను బిక్కు బిక్కుమంటూ తీసుకెళ్లాల్సి వస్తోందని ఆటో వాలాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోతుందని స్థానికులు వాపోతున్నారు. అయితే ఈ రోడ్డును ఏడాది క్రితం పునర్నిర్మించడానికి వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రయత్నాలు చేశారు. దీనిలో భాగంగా ఇరుగ్గా ఉన్న రోడ్డును **వెడల్పు చేసి పునర్నించేందుకు సుమారు రూ.65.40 లక్షల మార్కెట్ కమిటీ నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచారు. అయితే ఎవరూ** ముందుకు రాకపోవడంతో పనులు జరగలేదు. ఎన్నికల సమయంలో రోడ్డు పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హామీ ఇచ్చారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు దాటినప్పటికీ రోడ్డు పునర్నిర్మాణ పనులు చేపట్టలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. రోడ్డు నిర్మాణం కాక తాము నిత్యం నరకయాతన పడుతున్నామని వాపోతున్నారు. అయితే అధికారులు మాత్రం నిధుల మంజూరు కోసం ప్రతిపాదించామంటున్నారు.


ఏలేరు కాలువపై బలహీనంగా ఉన్న వంతెన

రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం



జాతీయ రహదారి నుంచి జమాదులపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డు గోతులతో నిండి ప్రమాదకరంగా ఉంది. దీంతో రాకపోకలకు నరకయాతన పడాల్సి వస్తోంది. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. రోడ్డు పునర్నిర్మించడానికి సత్వరమే చర్యలు తీసుకుని ప్రజల ఇబ్బందులు తొలగించాలి.

– రేఖా అప్పలనాయుడు, జమాదులపాలెం

గోతుల రహదారితో ఇక్కట్లు



జమాదులపాలెం రోడ్డు గోతులతో నిండి ఉండటం వల్ల ఆటోలు ఒక్కొక్కసారి ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రజలు బిక్కు బిక్కుమంటూ ప్రయాణించాల్సి వస్తోంది. గోతుల వల్ల అత్యవసర సమయాల్లో ఆటో డ్రైవర్లు గమ్యాలకు చేర్చడానికి ముందుకు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. రోడ్డు పునర్నిర్మించడానికి చర్యలు తీసుకోవాలి.

– ఒమ్మి అమ్మోజీ, జమాదులపాలెం

రోడ్డును బాగు చేయండి



జమాదులపాలెం రోడ్డు మధ్యలో ఏలేరు కాలువపై ఉన్న వంతెన బలహీనంగా, ప్రమాదకరంగా ఉంది. వంతెనకు రెండు వైపులా గోతులు పడి రాకపోకలు సాగించడానికి వీల్లేకుండా ఉంది. దశాబ్ద కాలంగా రోడ్డు దెబ్బతిన్నా ఎవరూ పట్టించుకోలేదు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. ఈ మేరకు రోడ్డు పునర్నిర్మించడానికి చర్యలు తీసుకొని ఇబ్బందులు తొలగించాలి.

– గొంతిన అప్పారావు, జమాదులపాలెం

నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం

జమాదులపాలెం రోడ్డును పునర్నిర్మించేందుకు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సూచనల మేరకు ప్రతిపాదనలు తయారు చేసి నిధుల మంజూరు కోసం పంపాం. నిధులు రాగానే పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం. గతంలో ఈ రోడ్డు మార్కెట్ కమిటీ నిధులతో పునర్నిర్మించడానికి టెండర్లు పిలిచినప్పటికీ ఎవరూ ముందుకు రాకపోవడంతో అప్పట్లో పనులు జరగలేదు.

– ఎల్. సత్యనారాయణ, డీఈ, పంచాయతీరాజ్ శాఖ, అనకాపల్లి.

ఘనంగా వినాయక నిమజ్జనం


కశింకోటలో వినాయక విగ్రహానికి పూజలు

కశింకోట: కశింకోట వేణుగోపాల స్వామి ఆలయం వద్ద నెలకొల్పిన వినాయక విగ్రహ నిమజ్జనోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు, యువ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రేజేటి మారుతి గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం గ్రామ వీధుల్లో వినాయక విగ్రహాన్ని ఊరేగించి స్థానిక శారదా నదిలో నిమజ్జనం చేశారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి


బుచ్చెయ్యపేటలో రక్తదానంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ, యువకులు

బుచ్చెయ్యపేట : రక్తదానం చేసి ఆపదలో ఉన్న మరొకరి ప్రాణాలు కాపాడాలని ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం రాత్రి మండల కేంద్రం బుచ్చెయ్యపేట, దిబ్బిడి గ్రామాల్లో వడ్డాదికి చెందిన అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సేవా సంస్థ అక్టోబర్ 2వ తేదీన గాంధీ జయంతి రోజు చేపట్టిన మెగా రక్తదాన శిబిరం విజయవంతం చేయాలని ఎస్ఐ యువకులతో కలిసి వీధుల్లో ప్రచారం చేశారు. వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్లో వెయ్యి మందితో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని మహిళలు, యువకులు అందరూ పాల్గొని రక్తదానం చేసి ఆపదలో ఉన్న వేలాది మందిని ఆదుకోవాలని ఎస్ఐ కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర రక్తదాన సేకరణ టీం లీడర్ బాలుతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పలువురు యువకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


బెల్లం మార్కెట్ యార్డులో శుభ్రం చేస్తున్న మేనేజర్ సత్యనారాయణ, ఉద్యోగులు


స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు

అనకాపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని జిల్లా లీడ్ బ్యాంక్స్ మేనేజర్ సత్యనారాయణ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డు ఆవరణలో ఆదివారం యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించి, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తామని తెలిపారు. యువత పరిసరాల శుభ్రతపై దృష్టి సారించి, పర్యావరణ పరిరక్షణకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రహదారులపై చెత్త వేయడం వల్ల వ్యాధుల బారినపడే అవకాశాలున్నాయని, పరిసరాలను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లాలోని యూనియన్ బ్యాంక్స్ మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు గడువు నేటి వరకే

- ఈకేవైసీ గడువు ఈ నెల 28 వరకూ
- మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి


మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి

రోలుగుంట : ప్రభుత్వం నిర్ణయించిన ఈ–క్రాప్ నమోదు సోమవారంతో ముగియనుంది. అలాగే ఈ–కేవైసీకి ఈ నెల 28 తో గడువు ముగియనుంది, రైతులు ఈ తేదీలలోపు వ్యవసాయ సిబ్బంది వద్ద తమ వివరాలు నమోదు చేయించుకొని ప్రభుత్వ రాయితీలు, ప్రభుత్వ పథకాలు పథకాలు పొందడానికి అర్హత పొందాలని మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ- పంట నమోదు చేయించుకున్న రైతు ఈ–కెవైసీ చేయించుకుంటేనే ఈ–పంట ప్రక్రియ పూర్తవుతుందన్నారు. మీకు తెలిపిన ఈ వివరాలు నమోదు చేయకుంటే రాబోవు కాలంలో ధాన్యం అమ్ముకోవడానికి గాని, పంట బీమా కాని, ఈ–పంట ధ్రువపత్రం కాని, అన్నదాత సుఖీభవ డబ్బులు రైతుల ఖాతాలో పడే విషయంలో లబ్ధి చేకూరదన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనంలో ఉంచుకొని నమోదు చేయించుకొని అర్హులు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

అర్హులకు పింఛన్లు అందజేస్తాం


జెట్టపురెడ్డితునిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట: అర్హులందరికి నెల రోజుల తర్వాత పింఛన్లు అందించడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. మండలంలోని జెట్టపురెడ్డితుని గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ అర్హులకు పింఛన్లు మంజూరు చేయడానికి గ్రామ సభ నిర్వహిస్తామన్నారు. వచ్చే దీపావళికి ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ చేస్తామన్నారు. జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా 450 ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇస్తామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నగంటి అప్పారావు, సర్పంచ్ కోన అరుణ, ఎంపీటీసీ సభ్యుడు షేక్ దర్గా, టీడీపీ మండలాధ్యక్షుడు కాయల మురళీధర్, మండల ప్రత్యేక అధికారి శిరీషారాణి, ఎంపీడీవో వి.వి. రవికుమార్, తహసీల్దార్ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మజ్జి నిరంజన్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు గొంతిన శ్రీనివారావు, కర్రి దుర్గినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే ఉన్నత లక్ష్యాలు

మునగపాక: విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకుంటే పోటీ పరీక్షల్లో రాణించి, ఉన్నత లక్ష్యాలు చేరుకోగలుగుతారని విశ్రాంత ఉపాధ్యాయుడు ప్రసాదరావు అన్నారు. 'మా ఊళ్లో గ్రంథాలయం' ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని మంగళవరపుపేటలో విద్యార్థులకు జాతీయ ప్రతిభా ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్)కు సంబంధించిన పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు సంబంధించి అన్ని పుస్తకాలు గ్రంథాలయాల్లో లభ్యమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం అధ్యక్షుడు భీశెట్టి ధనశ్రీను, డైరెక్టర్ ఆడారి సునీత, గ్రంథాలయాధికారి ఆడారి జగ్గప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

వరిలో పచ్చపురుగు తెగులు నివారించుకోండి


పొలంలో సోకిన పచ్చపురుగు తెగులు

రోలుగుంట : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి పొలాలను తెగుళ్లు ఆశించాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తెగుళ్లు సోకిన పొలాలను మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి సందర్శించి, రైతులకు తగు సూచనలు అందించారు. పొలంలో నిండుగా నీరు నిలిచిపోవడంతో పొలం ఏపుగా ఎదిగి పచ్చపురుగ తెగులు సోకిందన్నారు. ఒక దుబ్బుకి రెండు లేదా మూడు ఆకులు తెల్లగా గీకబడి, అందులో లార్వాలు కనిపిస్తే వంద దుబ్బుల్లో కనీసం అయిదు పైగా ఇలా కనిపిస్తే మందులు పిచికారి చేసుకోవాలని సూచించారు. ఎకరాకు కనీసం 15 నుంచి 20 చోట్ల పొలంలో అక్కడక్కడ పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. దీని వల్ల పురుగు ఉధృతి తగ్గుతుందన్నారు.

పురుగు ఉధృతి అయిదు శాతం మించి ఉంటే పురుగు మందుల పిచికారి ముందు పొడవాటి తాడు ఇద్దరు పట్టుకొని ఎదురెదురు గట్లపై గాని, పొలం మధ్యలో నడుచుకుంటూ పొలానికి అడ్డుగా తాడును వరి ఆకుల మీద నుంచి లాగినట్టయితే ముడుచుకొని ఉన్న ఆకుల్లో ఉన్న పురుగు రాలిపోతుందని తెలిపారు.

వరిలో ఆకుముడత ఆశించిన వెంటనే లక్షణాలు గమనించాక లేదా ఆకుముడత తొలి దశలోనే రెండు గ్రాముల కార్టాఫ్ హైడ్రో క్లోరైడును లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలని, లేదా ఎకరానికి 400 గ్రాముల కార్టాఫ్ పొడిమందు వినియోగించాలని సూచించారు. రైతులు వ్యవసాయ సిబ్బంది సూచనలు, సలహాలు పాటించి తెగుళ్ల నివారించుకోవాలన్నారు.

పరిశుభ్రతతో అంటువ్యాధులు దూరం


కె.సంతపాలెంలో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో అప్పలరాజు

కె.కోటపాడు : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడాన్ని బాధ్యతగా గుర్తించాలని ఎంపీడీవో ఎస్.అప్పలరాజు అన్నారు. కె.సంతపాలెం గ్రామంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. వర్షాల సమయంలో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు లేకుండా చూసుకోవాలన్నారు. సర్పంచ్ చల్లా మంగ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు


వంటర్లపాలెం తాచేరు నది ఒడ్డున్న గల కనకదుర్గమ్మ ఆలయం


ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ అమ్మవారు

మాడుగుల రూరల్ : వంటర్లపాలెం తాచేరు నది ఒడ్డున గల కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు వచ్చే నెల 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ చైర్మన్, గురు భవానీ దండి నర్సింగరావు ఆదివారం తెలిపారు. ఆలయం మందు భాగంలో దాతల సహకారంతో షెడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా తొలి రోజు అమ్మవారి చిత్రపటం గ్రామంలో ఊరేగింపు, సాయంత్రం భజన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఉత్సవాలు వచ్చే నెల 12 వ తేదీ దసరా వరకు ప్రతి రోజు నిత్య పూజలు, అభిషేకాలు, జలాభిషేకాలు, చండీ యాగం, మాలాధారణ భక్తులు ఆధ్వర్యంలో భజన కార్యక్రమం, చద్ది ఏర్పాటు చేస్తున్నట్టు చైర్మన్ తెలిపారు. దుర్గమ్మ మాలాధారణ కార్యక్రమం ఆలయం వద్ద జరుగుతుందని, భక్తులు మాలాధారణ వేసుకోవాలంటే ఆలయం వద్దకు రావాలని పూర్తి వివరాల కోసం 9000641853 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఆలయం వద్ద ఆధ్మాత్మిక, సంస్కాతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రోలుగుంట : మండలంలోని జె.నాయుడుపాలెం గ్రామంలో గల బాలికల వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, సీట్ల మంజూరులో అవకతవకలకు చోటు లేకుండా రిజర్వేషన్ ప్రక్రియ అమలు చేస్తామని మండల విద్యాశాఖాధికారి జాను ప్రసాద్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జె.నాయుడుపాలెం గ్రామంలో రూ.2.45 కోట్లు ఏపీడబ్ల్యూఐడీఈ నిధులతో అన్ని హంగులతో భవనం నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

ఈ విద్యా సంవత్సరం వృథా కాకుండా విద్యార్థులకు మేలు చేసే విధంగా ఇక్కడ ప్రవేశాలకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా విద్యాశాఖ, ఎక్స్ అఫిషియో ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ ప్రోసీడింగ్సు ఏపీ సమగ్ర శిక్ష అనకాపల్లి అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. అనాథలు, బెంచ్‌మార్కు వైకల్యాలు, స్కూల్ డ్రాపవుట్‌లకు మొదటి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని, మిగిలిన సీట్లు రిజర్వేషన్లను అనుసరించి ఇతర అభ్యర్థులతో భర్తీ చేస్తామని తెలిపారు. ఈ నెల 30 తేదీలోపు ఈ ప్రక్రియ పూర్తి కావల్సి ఉందని, అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలకు స్థానిక హెచ్ఎం, మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

శ్రమదానంతో జంగిల్ క్లియరెన్స్


జంగిల్ క్లియరెన్స్‌ను పర్యవేక్షిస్తున్న జెడ్పీటీసీ సత్యం

దేవరాపల్లి : మామిడిపల్లి గ్రామంలో గ్రామస్తులు శ్రమదానంగా ఆదివారం జంగిల్స్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. గ్రామస్తులంతా స్వచ్ఛందంగా రోడ్డు ఇరువైపులా ఏపుగా ఎదిగిన తుప్పలను డొంకలను తొలగించి శ్రమదాన స్ఫూర్తిని చాటారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా డొంకలు పెరగడంతో అటుగా ప్రయాణించే వాహన చోదకులు, ప్రయాణికులకు తగలడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరగడంతో మామిడిపల్లి గ్రామస్తులంతా ఐక్యంగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టేందుకు సంకల్పించారు. వృద్ధులు, మహిళలతో పాటు యువకులు సైతం కత్తి, కర్ర పట్టుకొని గ్రామానికి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. ఈ పనుల్లో స్థానిక జెడ్పీటీసీ కర్రి సత్యం, ఎంపీటీసీ పంచాడ సింహాచలంనాయుడు పాల్గొన్నారు.